


8మంది సచివాలయ సిబ్బందికి షోకాజ్‌లు

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని పి.కోనవలస పంచాయతీకి చెందిన 8మంది సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపిడిఒ బివిజె పాత్రో తెలిపారు. శుక్రవారం డ్వారా పీడీ కె.రామచంద్రరావు పి.కోనవలస గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల పట్ల నిర్లక్ష్యం వైఖరి ప్రదర్శించినందుకు, హాజరు రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడం, రక్షితమంచినీటి పథకం వద్ద అశుభ్రంగా ఉండడం, అలాగే పారిశుధ్యం, జంగిల్ క్లియరెన్స్ సరిగ్గా లేకపోవడం వంటి అంశాలపై నిర్లక్ష్యం వహించడంతో వీరికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారన్నారు. మూడురోజుల్లో ఈ నోటీసులకు సంజాయిషీ ఇవ్వాలని సిబ్బందిని కోరామని ఎంపిడిఒ తెలిపారు.

అప్పలరాజుపై పీడీ యాక్ట్‌ను ఉపసంహరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కురుపాం

అనకాపల్లి జిల్లా సిపిఎం నేత ఎం.అప్పలరాజుపై పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు అన్నారు. జియ్యమ్మవలస మండలం గడసింగపురంలో శుక్రవారం నిర్వహించిన నిరసనలో ఆయన మాట్లాడారు అనకాపల్లిలో ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్న బల్క్ డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా అప్పలరాజు ప్రజల తరపున శాంతియుత పోరాటం కొనసాగిస్తున్నారని, అలాంటి నాయకుడిపై పీడీ యాక్ట్ నమోదు చేయడం ప్రభుత్వ దుర్వినియోగమని విమర్శించారు. ఉగ్రవాదులు, స్మగ్లర్లు, రౌడీషీటర్లపై పెట్టాల్సిన కేసును ప్రజల తరపున ప్రశ్నిస్తున్న నాయకుడిపై ఉపయోగించడం అన్యాయమన్నారు. అప్పలరాజును వెంటనే విడుదల చేసి పీడీ యాక్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను ముమ్మరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జియ్యమ్మవలస మండల కార్యదర్శి కోరంగి సీతారాం, తదితరులు పాల్గొన్నారు.



గడసింగపురంలో నిరసన తెలుపుతున్నసిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు, కార్యకర్తలు

ధాన్యం కొనుగోలు చేయాలంటూ

ధాన్యం బస్తాలతో రైతులు నిరసన

ప్రజాశక్తి - బలిజిపేట

తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు చేయాలంటూ మండలంలోని వంతరాంకు రైతులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు వంతరాం గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం ధాన్యం బస్తాలను రోడ్డుకు అడ్డంగా వేసి నిరసనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత కొన్ని వారాలుగా ధాన్యం తయారై కళ్లల్లో నిల్వ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరించాల్సి ఉన్నప్పటికీ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రైతులకు ఎక్కడా ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటామన్న ప్రభుత్వ ప్రకటనలకు జరుగుతున్న పరిణామాలకు ఎక్కడా పొంతనలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని తీసుకోకపోవడంతో దళారుల ఆశ్రయించి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం తక్షణమే స్పందించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని గ్రామానికి చెందిన రైతులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.




రోడ్డుకు అడ్డంగా ధాన్యం బస్తాలు వేసి నిరసన తెలుపుతున్న రైతులు

కొటియాలో బాక్సైట్ తవ్వకాలపై స్పందించరేం?

ప్రజాశక్తి - సాలూరు

ఆంధ్రా - ఒడిశా సరిహద్దు ప్రాంతంలో గల వివాదాస్పద కొటియా గ్రామాల్లో బాక్సైట్ తవ్వకాలకు ఒడిశా ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వ్యవహారంపై టిడిపి ప్రభుత్వం మాజీ సిఎం రాజన్నదొర ప్రశ్నించారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొరాపుట్ జిల్లా పొట్టంగి తాలూకాలో 1745 ఎకరాల్లో బాక్సైట్ తవ్వకాలకు ఒడిశా ప్రభుత్వం అనుమతి మంజూరు చేసినట్లు కొన్ని పత్రికల్లో కథనాలు వచ్చాయని చెప్పారు. ఈ మేరకు దమన్‌జోడిలో ఉన్న నేషనల్ అల్యూమినియం కంపెనీతో ఒడిశా ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిసిందన్నారు. ఈ విషయం పత్రికల్లో రావడంతో కొటియా గ్రామాల్లోని ప్రజలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. గురువారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో తనను ఆహ్వానించిన గిరిజనులు బాక్సైట్ తవ్వకాలపై ఆందోళన వ్యక్తం చేశారన్నారు. ఈ వ్యవహారంపై 22 వివాదాస్పద గ్రామాలకు చెందిన గిరిజనులు భయాందోళనలో ఉన్నారన్నారు. వచ్చే ఏడాది నుంచి బాక్సైట్ తవ్వకాలు జరుగుతాయని నెల్కో సిఎండి ప్రకటన కూడా చేశారన్నారు. దీనిపై ఎపిలోని టిడిపి ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాక్సైట్ తవ్వకాలు వాస్తవమైతే సుప్రీం కోర్టులో ఉత్తర్వులున్నందున ఎపి ప్రభుత్వం ఈ విషయాన్ని సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. స్థానికగిరిజన శాఖా మంత్రి కూడా స్పందించడంలేదన్నారు. కొటియా గ్రామాల గిరిజనుల అవసరం లేదనుకుంటే ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. అలాంటి పరిస్థితి వస్తే వైసిపి కొటియా గ్రామాల గిరిజనులకు అండగా ఉంటుందని రాజన్నదొరతెలిపారు.

ఒడిశాతో ఎపి ప్రభుత్వం కుమ్మక్కయిందా? : రాజన్నదొర



బాధితురాలు ఫిర్యాదులను చూపుతున్న రాజన్నదొర, నాయకులు

ఆ వివాదంలోకి వైసిపిని లాగడం సబబు కాదు

పట్టణానికి చెందిన వితంతు మహిళా ఉద్యోగి బూర త్రివేణి వివాదంలోనికి మంత్రి సంధ్యారాణి వైసిపిని లాగడం సబబు కాదని రాజన్నదొర అన్నారు. ఓడిపోయామన్న బాధలో ఉన్న తమను ఈ వ్యవహారంలోకి లాగి రాజకీయ రంగు పులమడానికి మంత్రి ప్రయత్నిస్తున్నారని అన్నారు. తనకు జరిగిన అన్యాయం గురించి బాధిత మహిళ తొలుత ఓ మీడియా ఛానల్‌లో మాట్లాడిందన్నారు. అనంతరం ఎస్‌పికి ఫిర్యాదు చేశారని చెప్పారు. అక్కడ కూడా మీడియాతో మాట్లాడారన్నారు. సంబంధం లేని వ్యవహారంలోకి వైసిపిని లాగడం సమంజసం కాదన్నారు. మంత్రి పిఎ సతీష్‌పై బాధిత మహిళ ఎస్‌పికి ఫిర్యాదు, సాలూరు పోలీసు స్టేషన్‌లో రాసిన ఫిర్యాదులు వేర్వేరుగా ఉన్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారని చెప్పారు. పిఎను కాపాడుకోడానికి రాజకీయ ఒత్తిడి చేసి చిన్న సెక్షన్లతో కేసు నమోదుచేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని, వాస్తవాలు కోర్టు తేల్చుతుందని రాజన్నదొర చెప్పారు.

ధైర్యమే పిల్లలకు అసలైన ఆయుధం

మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - పార్వతీపురం

భావి భారత పౌరులైన పిల్లలు సాహసంతో ముందుకు సాగాలని, గురు గోవింద్ సింగ్ కుమారుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలని రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశుసంక్షేమశాఖామంత్రి జి.సంధ్యారాణి పిలుపునిచ్చారు. వీర్ బాల్ దివస్ సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ ప్రాంగణం వద్ద సైకిల్ ర్యాలీని జెండా ఊపి సైకిల్ ప్రారంభించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ పిల్లల్లోని ధైర్యసాహసాలను వెలికితీయడమే వీర్ బాల్ దినోత్సవం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. జిల్లాలోని పిల్లలు ఎంతో ధైర్యవంతులని, కొండలు, కోనలు దాటుకుంటూ, వాగులు ఈదుకుంటూ పాఠశాలలకు వెళ్లే ప్రతి విద్యార్థి ఒక బాలవీరుడేనన్నారు. స్థానికంగా పిల్లలు చేసే సాహసకృత్యాలను గుర్తించి, వారిని రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులకు ఎంపికయ్యేలా ప్రోత్సహించాలన్నారు. 0–18 ఏళ్ల లోపు పిల్లలందరికీ ఈ కార్యక్రమ ఉద్దేశ్యం తెలిసేలా ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు కషి చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏర్పాటు చేసిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి మంత్రి బహుమతులు అందజేశారు.



సైకిల్ ర్యాలీ ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

వన్ స్టాప్ సెంటర్ వాహనాన్ని ప్రారంభించిన మంత్రి

మహిళల రక్షణ, మరియు వారికి ఆపద సమయాల్లో అండగా నిలిచేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'వన్ స్టాప్ సెంటర్' (సఖి) నూతన వాహనాన్ని కలెక్టరేట్ ఆవరణలో స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖమంత్రి గుమ్మడి సంధ్యారాణి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ హింసకు గురైన మహిళలకు తక్షణ సేవలు అందించడమే ఈ వాహనం ప్రధాన లక్ష్యమన్నారు. గృహ హింస, వేధింపులు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఉన్న మహిళలు 181, 100 నంబర్లకు కాల్ చేసినప్పుడు, ఈ వాహనం ద్వారా సిబ్బంది బాధితుల వద్దకు చేరుకుంటారన్నారు. మహిళలు ఎటువంటి భయం లేకుండా తమకు కలిగిన ఇబ్బందులను వన్‌స్టాప్ సెంటర్ దృష్టికి తీసుకురావాలని కోరారు. 24 గంటలూ అందుబాటులో ఉండే ఈ సేవల ద్వారా ఎంతో మంది మహిళలకు భరోసా కలుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

భవిష్యత్తుకు పునాది పిల్లలే : కలెక్టర్

భవిష్యత్తుకు పునాదిగా ఉన్న చిన్న పిల్లలను గౌరవించేందుకే ఈ వేదిక అని జిల్లా కలెక్టర్ డా. ఎం ప్రభాకర రెడ్డి అన్నారు. మన దేశం కోసం సాహస బాలికల స్ఫూర్తి స్మరిస్తూ ప్రతి ఏటా డిసెంబర్ 26న నిర్వహించే 'వీర్ బాల్ దివాస్' వేడుకలు ఐసిడిఎస్ పీడీ టి. కనకదుర్గ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ కార్యాలయ సముదాయం ఆర్‌సిఎం ఆవరణలో కలెక్టర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని కాపాడే సాహస బాలబాలికల స్ఫూర్తిని, బాలల శక్తిని గుర్తించే పండగ్గా జరుపుకుంటున్నామన్నారు. దేశానికి పునాదిగా ఉన్న చిన్న పిల్లలను గౌరవించేందుకు ఈ జాతీయ స్థాయి కార్యక్రమం ఒక గొప్ప వేదిక అన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వైశాలి, డిఆర్‌ఒ కె.హేమలత, ఐసిడిఎస్ జాయింట్ డైరెక్టర్ ఎం.శిరీషా, ఎస్‌డిసి ధర్మ చంద్రారెడ్డి, ఆసుపత్రుల సమన్వయ అధికారి జి.నాగభూషణం, డిఇఒ నాగేశ్వరావు, జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ, కురుపాం సిడిపిఒ కె.విజయ గౌరి, మహాత్మా జ్యోతిబా పులే రెసిడెన్షియల్ పాఠశాల బాలికలు, ప్రభుత్వ గిరిజన హాస్టల్ విద్యార్థులు, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, సూపర్వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్థానిక సిబ్బంది ఉన్నారు.

పలు గ్రామాల్లో ముస్తాబు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని వెన్నెల బుచ్చింపేటలో పల్లె ముస్తాబు కార్యక్రమాన్ని ఎంపిడిఒ ఎంఎల్ ప్రసాద్ శుక్రవారం కార్యక్రమాన్ని ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులు ముస్తాబు కార్యక్రమం ద్వారా శుభ్రంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి బొంగు తిరుపతిరావు, గ్రామపెద్దలు, పంచాయతీ కార్యదర్శులు శశికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని కొండవాడ పంచాయతీ వత్తాడ, లుంబేసు పంచాయతీ లగుడుగూడలో ముస్తాబు కార్యక్రమం అధికారులు నిర్వహించారు. గ్రామాల్లో గల చెత్తాచెదారులను తొలగించారు. అలాగే కేదారిపురం కాలనీ కెడి కాలనీలో యువత శ్రమదానంతో గ్రామాన్ని అందంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభమైన కంది కొత్తల పండగ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజనుల సాంస్కృతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కందికొత్తల పండగతో ముడిపడి ఉన్నాయని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని తాడికొండలో గిరిజనుల సాంప్రదాయ పండుగ కందికొత్తల పండగ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలుత ఇరిడిలో వెలసిన కప్పరమ్మ తల్లిని కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తాడికొండలో జరుగుతున్న కందికొత్తలు పండుగ సంబరాల్లో పాల్గొన్నారు. గిరిజన సంప్రదాయానికి ప్రతీకగా నిలిచిన కందికొత్తల పండుగను ప్రతి ఏటా డిసెంబర్ చివరి వారంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. కొండపోడులో సాగుచేసిన కందులు, జొన్నలు, రాగులు, కొర్రలు, వరి వంటి కొత్త పంటలను ముందుగా గిరిజన దేవతలైన గొడ్డలమ్మ, సతరమ్మలకు నైవేద్యంగా సమర్పించిన అనంతరం వాటిని ఆహారంగా స్వీకరించే సంప్రదాయం ఈ పండగకు ప్రత్యేక అన్నారు. పండగ పూర్తయ్యే వరకు కొత్త పంటను ఆహారంగా తీసుకోరని, గిరిజన సాంప్రదాయాలు, సాంస్కృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే అన్నారు. కందికొత్తలు సందర్భంగా ఎమ్మెల్యే మహిళలతో కలిసి సంప్రదాయ థింసా నృత్యం చేస్తూ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో ప్రజలంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొని పండుగను విజయవంతం చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు అడ్డాకుల నరేష్, మండల కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు,నాయకులు బిడ్డిక కొండలరావు, ప్రజాప్రతినిధులు, గిరిజన నాయకులు, మహిళలు, గ్రామస్తులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



కందికొత్తల పండగను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి



అక్రమంగా తరలించేందుకు నదిలో పోగు చేసిన ఇసుక

భారీగా ఇసుక దోపిడీ

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
లబోదిబోమంటున్న రైతులు

ప్రజాశక్తి - వీరఘట్టం

పగలంతా ఒక చోట ఇసుకను జెసిబితో కుప్పలు వేసి రాత్రి సమయాల్లో భారీ వాహనాలతో ఇసుక అక్రమ రవాణా చేసి చేతినిండా డబ్బులు సంపాదిస్తున్నారు. అక్రమార్కుల అతి సులువుగా ఇసుకను దోచుకుని మూడు పువ్వులు, ఆరు కాయలుగా వ్యాపారం చేస్తూ కాసులు సంపాదిస్తున్నారు. మండలంలోని నడిమికెళ్ల సచివాలయం పరిధి కడికెల్ల సమీపాన జిఎస్‌ఆర్ స్టోన్స్ వెనుక భాగంలో ఉన్న నాగావళి నది తీరం నుంచి ప్రతిరోజు రాత్రి సమయాల్లో భారీ వాహనాలతో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న విషయం అధికారులకు తెలిసి ఉన్నప్పటికీ కనీస చర్యలు తీసుకోవడం లేదని, స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. రాత్రి సమయంలో భారీ వాహనాలతో ఇసుక అక్రమ రవాణా చేయడం వల్ల తమ పొలంలో వేసిన మొక్కలు నాశనమవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ తవ్వకాల వల్ల ఇటీవల కాలంలో విజయనగరం జిల్లా వంగర మండలం కోదులరాజు గుమ్మడ గ్రామానికి చెందిన వ్యక్తి పశువులు మేపుతూ అందులో ఒక ఆవు నీటిలోకి దిగిపోవడం వల్ల వాటిని తప్పించేందుకు ప్రయత్నించగా ఇసుక తవ్వకాల వల్ల పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో అందులో ఆ వ్యక్తి పడి ఊపిరాడక మృతి చెందిన విషయం తెలిసిందే. ఇంత భారీ మొత్తంలో ఇసుక దోపిడీ జరుగుతున్నప్పటికీ ఎందుకు అధికారులు పర్యవేక్షణ చేసి చర్యలు తీసుకోవడం లేదని, స్థానికులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఇసుక అక్రమ రవాణా జరగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోని అక్రమ రవాణాదారులపై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించండి

సీతంపేట : తమ సమస్యలు పరిష్కరించాలని పలువురు గిరిజనులు విన్నవించారు. శుక్రవారం స్థానిక ఐటిడిఎలో పిజిఆర్‌ఎస్‌లో పిఒ పవర్ స్వప్నిల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యల పరిష్కారం కోరుతూ పిజిఆర్‌ఎస్‌లో ఎపిఒ చినబాబు, డిడి అన్నదొర, డిప్యూటీ డిఇఒ రామ్మోహన్‌రావు, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ విజయపార్వతి తదితరులు పాల్గొన్నారు.

జంఝావతి సాధనకు ఇదే సరైన సమయం

ప్రజాశక్తి - కొమరాడ

జంఝావతి పూర్తిస్థాయి ప్రాజెక్టు సాధనకు ఇదే మంచి సమయమని జంఝావతి సాధన సమితి అధ్యక్షులు చుక్క భాస్కరరావు అన్నారు. శుక్రవారం ఆ సమితి ప్రధాన కార్యదర్శి పల్లి రాజగోపాల్ నాయుడు, కార్యనిర్వాహక కన్వీనర్లు మరిశర్ల మాలతీ కృష్ణమూర్తి నాయుడు, వంగల దాలి నాయుడు తదితరులతో కలిసి జంఝావతి ఆయకట్టు గ్రామాలైన రాధమ్మ పేట, పరశురాంపురం, మార్కొండపుట్టి తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని రైతులు, నాయకులను, సర్పంచులను ఐదు దశాబ్దాలుగా వేధిస్తున్న జంఝావతి సమస్యపై చర్చించారు. ఇన్నాళ్లు పాలకులు, అధికారులు ఒడిశా వివాదాన్ని సాకుగా చెబుతూ తప్పించుకున్నారన్నారు. ఇప్పుడు ఆంధ్రా, ఒడిశా, కేంద్రంలో బిజెపి అనుకూల ప్రభుత్వాలు ఉండడంతో జంఝావతి పూర్తిస్థాయి ప్రాజెక్టు సాధనకు ఇదే మంచి సమయం అన్నారు. కాబట్టి రైతులంతా ఏకమై పాలకులపై ఒత్తిడి తెచ్చి ప్రభుత్వాలు కదిలి సమస్య పరిష్కరించేలా సమాలోచన చేయాలన్నారు. అందుకే బాధిత గ్రామాల్లోని ఆయకట్టు రైతులతో కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆయా కమిటీలతో భవిష్యత్ కార్యాచరణ రూపొందించి ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్తామన్నారు. పాలకులు, అధికారులు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. లేనిపక్షంలో పోరాటం చేసిన ఈ తరుణంలో జంక్షన్ పూర్తిస్థాయి ప్రాజెక్టును సాధించుకోవాలన్నారు. త్వరలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సాధన సమితి ఆధ్వర్యంలో గ్రామ సమితులు సాధన దీక్షలో చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలకు రోడ్లు వేయాలి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని ఆంధ్ర- ఒడిశా సరిహద్దుల గల ఉదయపురం పంచాయతీ రెల్లిగూడ, మల్లుగూడ, డ్యామ్‌గూడ గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ మన్యం జిల్లా కమిటీ సభ్యులు బి.స్టీవెన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన రోడ్డుపైనే ప్లకార్డుతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన 78 ఏళ్లు గడిచినా సుమారు 60 కుటుంబాలు నివసిస్తున్న ఈ గ్రామాలకు ఇప్పటికీ రోడ్డు సౌకర్యం అందకపోవడం దౌర్భాగ్యకరమన్నారు. వర్షాకాలంలో రోడ్డు లేకపోవడంతో రవాణా, అత్యవసర వైద్యసేవలు, రోజువారీ అవసరాల కోసం గ్రామస్తులు తీవ్ర కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఈ సమస్యను పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన రావడం లేదని, గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలంటే ముందడుగు రహదారులే అవుతాయని, అందుకే తక్షణ చర్యలు తీసుకుని రోడ్డు పనులు చేపట్టాలని అధికారులను ఆయన కోరారు. లేకుంటే పోరాటాన్ని మరింత ముమ్మరం చేస్తామని హెచ్చరించారు.



రోడ్డు వేయాలని కోరుతూ ప్లయికార్డు పట్టుకొని నిరసన తెలుపుతున్న స్టీవెన్

పశుపోషణతోనే ఆర్థికాభివృద్ధి : కలెక్టర్

- రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా గోబాల సంబరం
- పశువుల ప్రదర్శనలో పాల్గొన్న 162 ఉత్తమ లేగ దూడలు

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

జిల్లాలో పశు సంవర్ధక రంగాన్ని బలోపేతం చేసి, రైతులకు అదనపు ఆదాయం చేకూర్చడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్ ప్రభాకర రెడ్డి అన్నారు. మండలంలోని ఎంఆర్ నగర్‌లో నిర్వహించిన 'మన్యం గోబాల సంబరం' ఘనంగా జరిగింది. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ మెగా పశు వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ స్వయంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పశు సంవర్ధక రంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటిదన్నారు. "జిల్లాను పాలు, మాంసం, గుడ్ల ఉత్పత్తిలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపడమే మా లక్ష్యం. రైతులు కేవలం పాత పద్ధతులకు పరిమితం కాకుండా, శాస్త్రీయమైన పద్ధతులు, కృత్రిమ గర్భధారణ సేవలను వినియోగించుకుని నాణ్యమైన పశు సంపదను వృద్ధి చేసుకోవాలన్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా ప్రయోగాత్మకంగా నిర్వహించిన ఈ సంబరంలో వివిధ మండలాల నుంచి రైతులు తమ 162 ఉత్తమ జాతి లేగ దూడలను ప్రదర్శనకు తీసుకువచ్చారు. నిపుణులైన వైద్యులు దూడల ఆరోగ్యం, పెరుగుదల, జన్యులోప లక్షణాలను పరిశీలించి శస్త్రలతో సరి చేశారు. శిబిరంలో 126 పశువులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడమే కాకుండా, మొండి వ్యాధులకు ప్రత్యేక చికిత్సలు అందించారు. ముఖ్యంగా 105 ఆవులు, గేదెల్లో వచ్చే గర్భకోశ సంబంధిత సమస్యలకు అనుభవజ్ఞులైన పశు వైద్యులచే సమగ్ర చికిత్సలు అందించారు. 652 గొర్రెలు, మేకల నట్టల నివారణ మందులు, టీకాల పంపిణీతో పాటు శాస్త్రీయ పశుపోషణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ శివ్వాల మన్మధ రావు, డిఎల్‌ఇఒ రాధాకృష్ణ, సహాయ సంచాలకులు దీనాకుమార్, శ్రీనివాసరావు, గంగాధర్, పశు వైద్యులు చక్రధర్, రామారావు, లలిత, జయ కిరణ్, అను, చైతన్య శంకర్, సురేష్, రమేష్, స్థానిక సర్పంచ్ లక్ష్మి, త్రినాథరావు, పెద్ద సంఖ్యలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.



లేగదూడల ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి



విద్యార్థినిని అభినందిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి


రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలో నిఖితకు ప్రథమ స్థానం

ప్రజాశక్తి – పార్వతీపురంటౌన్

రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలో మన్యం జిల్లా విద్యార్థిని ప్రథమ స్థానాన్ని సాధించిన విద్యార్థినిని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి శుక్రవారం తన ఛాంబర్లో అభినందించారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఈనెల 23న విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం, డిపార్ట్మెంట్ ఆఫ్ కన్స్యూమర్ ఎఫైర్స్, ఫుడ్ అండ్ సివిల్ సప్లై స్ శాఖ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో స్థానిక వాసవీ జూనియర్ కళాశాల విద్యార్థిని ఎస్ఎం నిఖిత రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈనెల 20న జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వివిధ కళాశాలలకు చెందిన ఎస్ఎం నిఖిత, దాగూర్ నాయుడు, ఎంఎం వైష్ణవి, కె.పూర్ణ చందు తదితరులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు కైవసం చేసుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. చక్కగా చదువుకుని, తల్లిదండ్రులకు, అధ్యాపకులకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వై.నాగేశ్వరరావు, వాసవీ కళాశాల కరస్పాండెంట్ పివికె మణికుమార్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

అచ్చెన్నాయుడును కలిసిన గ్రంథాలయ సంస్థ చైర్మన్ డొంకాడ

ప్రజాశక్తి – కురుపాం



రామకృష్ణను సన్మానిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ఉమ్మడి విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డొంకాడ రామకృష్ణ శ్రీకాకుళంలో రాష్ట్ర వ్యవసాయశాఖ, మన్యం జిల్లా ఇన్ఛార్జి మంత్రి కింజరాపు అచ్చంనాయుడును, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావులను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై పరస్పరం చర్చించారు. కార్యక్రమంలో అరకు పార్లమెంటరీ నియోజకవర్గ టిడిపి ప్రధాన కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ గులిపల్లి సుదర్శనరావు, కురుపాం నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు గురాన శ్రీరామమూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ రాష్ట్రచైర్మన్గా కోలక

ప్రజాశక్తి – కురుపాం



ఈనెల 16న అరకు వేలీలో ఆలిండియా ఆదివాసీ రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, ప్రత్యేక చట్టాలు, ప్రత్యేక సదుపాయాలు రక్షించుకొనేందుకు, అమలుకు జాతీయ స్థాయిలో కమిటీల నియామకం చేపట్టారు. దీనితో భాగంగా ఎపి రాష్ట్రకమిటీ చైర్మన్గా తనను నియమించినట్లు మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణరావు తెలిపారు. ఈ మేరకు ఆ పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు నియామక పత్రం అందజేశారని, ఆదివాసీల అభివృద్ధికి పాటుపడతానని, తనను నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి – పాచిపెంట

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుందని మండల టిడిపి అధ్యక్షులు గూడెపు యుగంధర్ తెలిపారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. సిఎం సహాయక సహకారాలతో మంత్రి సంధ్యారాణి జి.సంధ్యారాణి సారథ్యంలో మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు చూపారన్నారు. అధిష్టానం ఆదేశాల మేరకు పాచిపెంట టిడిపి అధ్యక్షుడిగా తానే కొనసాగుతున్నానని, మంత్రి సంధ్యారాణి కూడా పత్రికా ముఖంగా ప్రకటించారని తెలిపారు. కొంతమంది ఎవరెవరో వారి పేర్లు ప్లేక్సీలో మండల పార్టీ అధ్యక్షులుగా ముద్రించుకుంటున్నారని, వారి విజ్ఞతకే వదిలేస్తున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎఎంసి చైర్మన్ ఎం.సూర్యనారాయణ, చల్ల కనక, పూసర్ల నర్సింగరావు, పి.ఉమామహేశ్వర రావు, ఎం.బలరాం, కె.పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం

ప్రజాశక్తి – కొమరాడ

తమ చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే పూర్తి ఆరోగ్యం సాధ్యమని మండలంలోని విక్రమపురం ఎంపిటిసి సభ్యులు దేవకోటి వెంకటనాయుడు అన్నారు. మండలంలోని శివినిలో డ్రై డే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు వీధుల్లో పర్యటన చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ చుట్టూ ఉన్న పరిసరాలను పూర్తిస్థాయిలో పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే తమతో పాటు తమ చుట్టూ ఉన్న వారు పూర్తి ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. గ్రామంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని పూర్తిగా పిచ్చి మొక్కలు అధికంగా తొలగించుకోవాలని తెలిపారు. గ్రామాల్లో ఉదయం పూట వస్తున్న పారిశుధ్య కార్మికులకు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని అలాంటప్పుడు గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, సర్పంచ్ కుమారి, ఐటిడిఎ ఇంజినీరింగ్ అధికారి గౌరునాయుడు, టిడిపి నాయకులు పొట్నూరు వెంకట నాయుడు, సచివాలయ ఉద్యోగులు గ్రామస్తులు పాల్గొన్నారు.

పక్కాగా రికార్డులు నిర్వహించాలి

ప్రజాశక్తి – సాలూరు

సాలూరు సబ్ డివిజన్ పరిధిలోని సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల వ్యవసాయ శాఖ అధికారులకు సిబ్బందికి శుక్రవారం సమాచార హక్కు చట్టం– పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సాలూరు సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సత్యవతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయ పౌర సమాచార అధికారి కె.శ్రీనివాస్ సిబ్బందికి సమాచార హక్కు చట్టంపై పలు సూచనలు చేశారు. ఆర్టీఐ చట్టం కింద ప్రతి కార్యాలయంలో తప్పనిసరిగా నిర్వహించాల్సిన రిజిస్టర్ల గురించి సిబ్బందికి అవగాహన కల్పించారు. సమాచార హక్కు చట్టానికి సంబంధించి సిబ్బంది అడిగిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు. కార్యక్రమంలో మూడు మండలాల మండల వ్యవసాయ అధికారులు, గ్రామ వ్యవసాయ, ఉద్యాన, తదితర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు కదలదు.. వాడుక నీరు వెళ్లదు

ప్రజాశక్తి – బలిజిపేట



కాలువలో పేరుకుపోయిన మురుగు

మండలంలోని పలగర కొట్టిశకాలనీలో గల కాలువల్లోని మురుగునీరు నిల్వ ఉండడంతో దుర్వాస వెదజల్లుతోంది. దీనికి తోడు దోమలు కూడా స్వైరవిహారం చేస్తున్నాయి. ఈ కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం పూడ్చకపోవడంతో దోమలకు ఆవాసాలుగా మారాయి. దోమల వల్ల మలేరియా, టైఫాయిడ్, కలరా, డెంగీ తదితర సీజనల్ వ్యాధుల బారిపడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే అక్కడే ఉన్న వాటర్ ట్యాంకు లీకైనందు వల్ల గ్రామస్తులకు వాడుక నీరు లేనందున ఇబ్బందులకు గురవుతున్నారు. పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్ స్పందించి మురుగు కాలువలను శుభ్రం చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పైపు లైన్లు బాగు చేసి తాగు నీరివ్వాలి


- ఎమ్మెల్యే పర్యటనతో నిలిచిన మంచి నీటి సరఫరా
- 25 రోజుల నుంచి నీరు లేదంటూ
ఐద్వా ఆధ్వర్యంలో గెడ్డవీధి మహిళల ఆందోళన

ప్రజాశక్తి – పార్వతీపురంటౌన్

పైపు లైన్లు బాగు చేసి తాగునీరివ్వాలని పట్టణంలోని 18, 19 వార్డుల్లో గల గెడ్డవీధి, హరిజన వీధి మహిళలు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీదేవి మాట్లాడుతూ కొండ నాలికకు మందు పూస్తే ఉన్న నాలిక ఊడినట్లు నేటి పాలకుల విధానం ఉందని ఎద్దేవా చేశారు. స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పర్యటనలో భాగంగా హరిజన వీధిలో రెండిళ్ల గాను కాలువల్లో పైపులైన్లు ఉన్నాయని, వాటిని తొలగించి, రోడ్డుపైకి పైపులైన్ కనెక్షన్ ఇవ్వాలని ఆయా మహిళలు మంత్రికి విన్నవించుకున్నారు. అయితే ఆ మరుసటి నాడే ఆగమేఘాలపై కాంట్రాక్టర్కు పని అప్పగించి పనిముట్లు సామాగ్రితో గెడ్డవీధి, హరిజన వీధిలో గల పాత పైపులైన్లను ఊడదీసి కొత్త పైపులైను పెట్టేందుకు ఏర్పాట్లు చేసి, మధ్యలో పూర్తిగా విడిచి పెట్టేశారని అన్నారు. కాలువల్లో ఉన్న పైపు రోడ్డుపైకి తీసి నేటికి 25 రోజులైనా మంచి నీరందని పరిస్థితి ఉందని తెలిపారు. నీరు లేక కొళాయి నీళ్ల కోసం పక్క వీధులకు వెళ్లి తాగునీరు తెచ్చుకునే పరిస్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తం చేశారు. నీటి సమస్యలపై పలుమార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకునే పరిస్థితి లేదని వాపోయారు. కాంట్రాక్టర్ డబ్బులిస్తేనే పని పూర్తి చేస్తానంటూ, ఒక్కొక్క ఇంటికి రూ.500 చొప్పున డిమాండ్ చేస్తున్నారని ఇది చాలా అన్యాయమని మండిపడ్డారు. పైపులైన్ల కోసం తవ్విన గోతుల వల్ల రోడ్డు మొత్తం పాడైపోయిందని, చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు చేసిన నిర్వాహకం వల్ల ప్రజలు బలి కావాలా అని ప్రశ్నించారు. ఇదేనా ప్రజలపై ప్రభుత్వానికున్న చిత్తశుద్ధి అంటూ విమర్శించారు. సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు సమస్యలు సృష్టిస్తే ఎలా అని ప్రశ్నించారు. కావున జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పెండింగులో ఉన్న పైపులైన్ల పనులు పూర్తి చేయాలని, కుళాయిల ద్వారా నీటి సరఫరా సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలని, తవ్విన పైపులైన్ గోతులను పోడ్చాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు కృష్ణవేణి, స్వాతి, సత్యవతి, ధనలక్ష్మి, లక్ష్మి, సంగమ్మ, జయలక్ష్మి, డి.సీతారాం, ఉమా తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న 18,19 వార్డు మహిళలు



ఎస్డబ్ల్యుపిసి షెడ్ను ధ్వంసం చేసి వెళ్లిపోతున్న ఏనుగులు

ఎస్డబ్ల్యుపిసిని ధ్వంసం చేసిన ఏనుగులు

ప్రజాశక్తి – గరుగుబిల్లి

మండలంలోని సుంకిలో శుక్రవారం కరిరాజులు (చెత్త నుంచి సందపను తయారు చేయు కేంద్రం)ఎస్డబ్ల్యుపిసి షెడ్కు వేసిన కంచె స్తంభాలను ధ్వంసం చేశాయి. రాత్రి సమయం ఏనుగులు సంచరిస్తుండడంతో పరిసర ప్రాంత ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గజరాజులను తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

ఇంకెన్ని ప్రాణాలు బలి కావల్సి ఉందో : సిపిఎం

మన్యం జిల్లాలో ఏనుగులు వల్ల ఇప్పటికే మరణించిన కుటుంబ సభ్యులు ఆదరణ లేక అల్లాడుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లు గంగునాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. అనేక ఏళ్లుగా ఈ ఏనుగులను కాపలా కాసేందుకు పెట్టే ఖర్చుతో ప్రజల ప్రాణాలనూ చిత్తశుద్ధి ఉంటే ఏనుగులను అరణ్యాల వైపు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పిల్లల్లో నైపుణ్యాన్ని గుర్తించాలి

ప్రజాశక్తి-పార్వతీపురం

విద్యార్థులను కేవలం ఉత్తీర్ణులు చేయడం మాత్రమే కాకుండా, వారిని సమాజానికి పనికొచ్చే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే ఉపాధ్యాయుల ప్రధాన లక్ష్యం కావాలని జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి హితవుపలికారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులతో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాబోధనలో ఉపాధ్యాయులు అనుసరించాల్సిన కీలక మార్పులపై పలు సూచనలు చేశారు. పిల్లల్లో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించి వారికి ప్రోత్సహించాలన్నారు. ప్రతి గంటకు ఒకసారి పిల్లలతో 10సెకన్లు డ్యాన్స్ చేసేలా చూడాలన్నారు. ఇంగ్లీష్ టీచర్స్ పిల్లలకు ఆటల రూపంలో ఇంగ్లీష్ నేర్పించాలన్నారు. పిల్లలకు ఏదైనా మంచి విషయం చెప్పే ముందు, ఆ విషయాన్ని ఉపాధ్యాయులు తమ వ్యక్తిగత జీవితంలో పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఉపాధ్యాయుడు ఆచరించి చూపిస్తేనే విద్యార్థులు వారిని రోల్ మోడల్గా తీసుకుంటారన్నారు. నవ్వకపోవడం ఒక రోగం పిల్లలతో ఎప్పుడూ నవ్వుతూ ఉండండి, వారిని నవ్వించండి అని కలెక్టర్ వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మజీ, ట్రైబల్ వెల్ఫేర్ ఉపసంచాలకులు విజయశాంతి, మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్ కళాశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

వ్యాధుల నియంత్రణలో డ్రైడే కీలకం : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-కొమరాడ

వ్యాధుల నియంత్రణలో డ్రైడే కీలక పాత్ర వహిస్తుందని, ప్రతీ ఒక్కరూ డ్రైడే పాటించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు సూచించారు. శివిని గ్రామంలో ఫ్రైడే డ్రైడే నిర్వహణ తీరును శుక్రవారం పరిశీలించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను తనిఖీ చేశారు. షాపులవద్ద చెత్త తొట్టె ఉండేలా పర్యవేక్షించాలన్నారు. వెక్టార్ కంట్రోల్ హైజీన్ యాప్ లో దోమల సమస్యాత్మక ప్రదేశాలను గుర్తించి వైద్య సిబ్బంది అప్లోడ్ చేయాలని, తదుపరి నివారణ చర్యలు జరిగేలా కార్యాచరణ చేపట్టాలని అన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా వారానికి ఒకసారి డ్రైడే పాటించేలా సమన్వయ శాఖల సిబ్బందితో కలిసి ఎప్పటికపుడు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్సిడి అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు, ప్రోగ్రాం అధికారి డా.కౌశిక్, వైద్యాధికారి డాక్టర్ జి.దేవేంద్ర, పంచాయతీ సెక్రటరీ జోసెఫ్ పీటర్, ఎఎన్ఎం పోలమ్మ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యులు

బాల్య వివాహాలు చేస్తే శిక్ష తప్పదు

ప్రజాశక్తి – కురుపాం

బాల్య వివాహాలు చేస్తే శిక్షలు తప్పవని లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యులు గొటారి వెంకటరావు, అందవరపు కోటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం పొడి పంచాయతీ లక్ష్మీపేట గ్రామంలో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. బాల్యవివాహాల దుష్పరిణామాలు, చట్టపరమైన నిబంధనలు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు, పారా లీగల్ వాలంటర్లు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

రెబ్బ, వనధార గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి – కొమరాడ

మండలంలోని మారుమూల గ్రామాలైన రెబ్బ, వనధార గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని చోళ్ల పదం పంచాయతీకి చెందిన అటు ఒడిశా, ఇటు ఆంధ్రా సరిహద్దులో ఉన్న రెబ్బ, వనధార గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో నాగావళి నదిలో కూడా సొంతగా పడవ తయారు చేసుకుని చాలా ఇబ్బందులు పడుతూ ప్రాణానికి తెగించి నదిలో ప్రయాణిస్తూ ఆసుపత్రికి వచ్చే పరిస్థితులు ఉన్నాయన్నారు. ఎన్నికల ముందు ఈ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామని తాజా, మాజీ ఎమ్మెల్యేలు హామీలు ఇస్తున్నారే తప్ప అమలు చేయడంలేదన్నారు. రేషన్ బియ్యం తెచ్చుకోవడానికి ప్రతినెలా సుమారు 6 కిలోమీటర్ల దూరం కూనేరు నడుచుకొని వచ్చి ఆయా గ్రామాలకు వెళ్లే పరిస్థితుల్లో బియ్యం ఉచితంగా ఇచ్చిన వాటి రవాణా కోసం మాత్రం అధిక మోతాదులో ఖర్చులు అధికంగా అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన వాటక త్రినాధ్, కొండగొర్రె జగదీష్ పాల్గొన్నారు.

రీసర్వేలో భూ హక్కు పత్రాలు చూపాలి

ప్రజాశక్తి –మక్కువ

మండలంలోని నాలుగో విడత భూముల రీ సర్వే ను ప్రభుత్వం జనవరి 2 నుండి 6 నెలల పాటు నిర్వహించనున్నట్లు తాహశీల్దార్ కె.భరత్ కుమార్ తెలిపారు. శుక్రవారం సంబర గ్రామంలో రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది సర్వేకు వచ్చినప్పుడు భూమి హక్కు పత్రాలు రైతులు చూపాలన్నారు. వివాదస్పద భూములు మినహా పలు రకాల సమస్యలకు రీ సర్వే ద్వారా పరిష్కారం లభిస్తుందని ఆయన అన్నారు. సర్వే జరిగే ప్రాంతాలను ముందుగానే ప్రకటించడం జరుగుతుందని, రైతులంతా సిద్ధంగా ఉండాలన్నారు.

సిఐటియు మహాసభ జయప్రదానికి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి –సాలూరు

ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరుగుతున్న 18వ అఖిలభారత సిఐటియు మహాసభలు జయప్రదం చేయాలంటూ శుక్రవారం సాలూరు పట్టణంలో విస్తృతంగా సిఐటియు నాయకులు ప్రచారం చేశారు. ఈ మేరకు స్థానిక వైటిసి ఆవరణంలో జరిగిన అంగన్వాడి సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం శ్రీను మాట్లాడారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కార్మికులతో సమావేశం జరిగింది. మున్సిపల్ వర్కర్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ సాలూరు కమిటీ అధ్యక్ష కార్యదర్శి, కమిటీ సభ్యులు జనవరి 4న జరిగే బహిరంగ సభ కరపత్రాన్ని విడుదల చేస్తారు. అనంతరం కార్మికులలో బహిరంగ సభ జయప్రదానికి తరలిరావాలని పిలుపునిచ్చారు.



ప్రచారం చేస్తున్న అంగన్వాడీలు, సిఐటియు నాయకులు

కార్మిక వర్గం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ మహాసభల్లో చర్చించనుందని, కార్మిక వర్గ ఐక్యతకు సిఐటియు కృషి చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో మొదటిసారి జరుగుతున్న అఖిలభారత మహాసభలను జయప్రదం చేసేందుకు అన్ని రంగాల కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాలు ఫెడరేషన్ జిల్లా మహిళా కో కన్వీనర్ గంట్రెడ్డి స్వప్న, నాయకులు మధుమోహన్, పోలరాజు, లక్ష్మి, అంగన్వాడీ నాయకులు అరుణ జ్యోతి, మాణిక్యం, మీనా, హైమా తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్కు వైద్య, ఆరోగ్యశాఖ ఘన సన్మానం

ప్రజాశక్తి-పార్వతీపురం

వినూత్న కార్యక్రమాల అమలుతో జిల్లాకు ఎంతో గుర్తింపు తీసుకువచ్చిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు తన వైద్య బృందంతో కలెక్టరేట్లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల, దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. ముస్తాబు కార్యక్రమం ఆరోగ్యం రీత్యా ఎంతగానో దోహద పడుతున్నదని, అనారోగ్య సమస్యలు తగ్గుముఖం పడుతున్నాయని డిఎంహెచ్ఒ అన్నారు. కలెక్టర్ ప్రవేశపెట్టిన 'మా ఊరికి మలేరియా వచ్చింది' కార్యక్రమంతో జిల్లాలో మలేరియా కేసులు చాలా వరకు తగ్గాయని, ప్రజల్లో అవగాహన పెరిగిందని డిఎంహెచ్ఒ అన్నారు. కలెక్టర్ ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ ఈ విజయం అందరి కృషి ఫలితం అని, ఇదే స్ఫూర్తితో సమష్టిగా పని చేస్తూ వ్యాధుల నియంత్రణపై దృష్టి సారించి, మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ కె.వి.ఎస్ పద్మావతి, ప్రోగ్రాం అధికారులు టి.జగన్ మోహనరావు, పిఎల్.రఘుకుమార్, ఎమ్. వినోద్ కుమార్, సూర్యకౌశిక్, ఎపి ఎన్జిఒ జిల్లా అధ్యక్షుడు జివిఆర్ఎస్ కిషోర్, నేత్ర వైద్య అధికారి నగేష్ రెడ్డి, డెమో గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ను సన్మానిస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది

పిన్నింటిని పరామర్శించిన తేజోవతి

ప్రజాశక్తి-పాచిపెంట

అరకు పార్లమెంటు నియోజకవర్గ టిడిపి అధ్యక్షురాలు ఎం.తేజోవతి శుక్రవారం పాచిపెంట మాజీ ఎంపిపి పిన్నింటి ప్రసాద్బాబును పరామర్శించారు. గత కొంతకాలంగా ప్రసాద్ బాబు అనారోగ్యంతో ఉన్న విషయం తెలుసుకున్న తేజోవతి ఆయన ఇంటికి వెళ్ళి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో టిడిపికి పూర్వవైభవం తెచ్చేందుకు కలిసి పని చేయాలని ఆమె సూచించారు. ఆమె వెంట మాజీ జెడ్పి వైస్ చైర్మన్ పిన్నింటి ఈశ్వరరావు తోపాటు మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

స్వయం సంరక్షణతో బోధ వ్యాధి తగ్గుముఖం

ప్రజాశక్తి –పార్వతీపురంటౌన్

స్వయం సంరక్షణ పద్ధతులతోనే బోధ వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చని డిఎంహెచ్ డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. హిందూస్తాన్ షిప్యార్డ్ లిమిటెడ్, లెప్రా సొసైటీ సౌజన్యంతో ఫైలేరియా బాధితులకు చెప్పులు, స్వయం సంరక్షణ కిట్ల పంపిణీ జిల్లాలో నిర్వహించారు. ఈ మేరకు స్థానిక డిఇసి కేంద్రంలో శుక్రవారం కిట్లను అందజేశారు. అనంతరం భాస్కరరావు మాట్లాడుతూ స్వయం సంరక్షణ పద్ధతులు పాటించడం ద్వారా బోధ వ్యాధి తీవ్రత తగ్గించవచ్చని, వాటిని వినియోగించే పద్ధతులపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఫైలేరియా లక్షణాలు సత్వరమే గుర్తించాలని, సంబంధిత శాఖల సమన్వయంతో మురుగు నీటి నిల్వలు లేకుండా కార్యాచరణ చేయాలన్నారు. ప్రజారోగ్యం దృష్ట్యా ఉపకరణాలను అందజేసిన హిందుస్తాన్ షిప్యార్డ్ వారికి అభినందనలు తెలిపారు. కిట్లును సద్వినియోగం చేసుకొని ఆరోగ్యం కాపాడుకోవాలని రోగులకు సూచించారు. జిల్లాలో 360 మంది ఫైలేరియా బాధితులకు చెప్పులు, కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారులు టి.జగన్ మోహనరావు, ఎం.వినోద్ కుమార్, పిఎల్.రఘు కుమార్, కౌశిక్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్ రెడ్డి, జిల్లా మలేరియా కన్సల్టెంట్ రామచంద్రరావు, వైద్యాధికారులు, లెప్రా సొసైటీ ఫండ్ రైజింగ్ ఎగ్జిక్యూటివ్ లెంక రమణ, ఫిజియోథెరపిస్ట్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల ఉపాధికి ఎసరుపెట్టిన మోడీ : కాంగ్రెస్

ప్రజాశక్తి – గుమ్మలక్ష్మీపురం

పూజ్య బాపూజీ ఆదర్శాలను అవమానించడమే లక్ష్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుపేద ప్రజల పొట్టకొట్టడమే పనిగా కేంద్రంలో గల మోదీ సర్కార్ ఉవ్విళూరుతోందని కురుపాం నియోజక వర్గ కాంగ్రెస్ కో – ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు ధ్వజమెత్తారు. ఉపాధి హామీ చట్టానికి ఉన్న మహాత్ముడి పేరును తొలగిస్తూ విబిజి రామ్జి పేరిట బిల్లును తీసుకురావడం ఇందులో భాగమేనన్నారు. 20 ఏళ్ల క్రితం కాంగ్రెస్ సారథ్యంలో గల యుపిఎ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బృహత్తర పథకం గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం దార్శనికతకు సజీవ రూపమే గాక, కోట్లాదిమంది గ్రామీణ పేదలకు జీవనాధారమైనదని పేర్కొన్నారు. ఉపాధి ఒక హక్కుగా ఉన్న గాంధీ పథకాన్ని మోదీ ప్రభుత్వం దాతృత్వ కార్యక్రమంగా మలుచుకుంటూ పంచాయతీలు, రాష్ట్రాల చేతుల్లోంచి నిర్ణయాధికారాలను కొల్లగొట్టి ఆర్థిక భారాన్ని మాత్రం రాష్ట్రాల మీద నెట్టుతూ తప్పుకో చూస్తోందని ఆక్షేపించారు.

రాజ్యాంగబద్ధంగా దక్కిన పని హక్కును వేతన కార్మికులు ఈ కొత్త బిల్లుతో ఆ హక్కును కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. మహాత్మా గాంధీ పేరును రద్దుచేసి దాని స్థానంలో జిరామ్జి అంటూ బిజెపి తన కొత్త పథకంలో గాంధీ పేరుతో పాటు మొత్తంగా పేదల ఉపాధికే ఎసరుపెట్ట బోతోందని హెచ్చరించారు. ఈ ప్రజా వ్యతిరేక బిల్లును కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని చిన్నారావు స్పష్టం చేశారు.

పోలీసుస్టేషన్ను పరిశీలించిన ఎఎస్పి

ప్రజాశక్తి –కొమరాడ

ప్రజల రక్షణే ధ్యేయంగా విధి నిర్వహణలో పోలీసులు ముందుండాలని పార్వతీపురం ఎఎస్పి వి.మనీషా రెడ్డి అన్నారు. శుక్రవారం ఆంధ్ర ఒడిస్సా సరిహద్దు ప్రాంతంలో ఉన్న కొమరాడ పోలీస్ స్టేషన్ను వార్షిక తనిఖీలో భాగంగా పరిశీలించారు. రికార్డులు పరిశీలించి, కేసుల నమోదు, వాటి స్థితిగతులను తెలుసుకున్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి గంజాయి, నాటుసారా అక్రమ రవాణాలు అరికట్టాలని, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం స్టేషన్ పరిసరాలను పర్యవేక్షిస్తూ,భద్రతా ఏర్పాట్లు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నీలకంఠ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎఎస్పి మనీషారెడ్డి

ఖోఖోలో విజయనగరానికి ద్వితీయ స్థానం

ప్రజాశక్తి-విజయనగరం

ఈనెల 24 నుండి 26 వరకు గుడివాడలో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ స్త్రీ పురుషుల అంతర్ జిల్లా ఖోఖో టోర్నమెంట్లో విజయనగరం పురుషుల జట్టు ద్వితీయ స్థానం సాధించింది. ఈ బహుమతిని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము చేతుల మీదుగా క్రీడాకారులు అందుకున్నారు. ద్వితీయ స్థానంలో నిలిచిన పురుషుల జట్టు సభ్యులకు జిల్లా ఖోఖో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.విజయలక్ష్మి, ఎఎంవి కమలనాభరావు, కె.గోపాల్ అభినందనలు తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న డిఇఒ బ్రహ్మాజీరావు

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసలు

ప్రజాశక్తి-పార్వతీపురం

జాతీయ స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన నర్సిపురం జెడ్పి హైస్కూల్ విద్యార్థులను డిఇఒ పి.బ్రహ్మాజీరావు అభినందించారు. శుక్రవారం పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థులు డి.రిషీంద్ర నాయుడు, ఎస్.గుణవర్ధన్లు, గైడ్ టీచర్ మురళీకృష్ణతో కలిసి డిఇఒ బ్రహ్మాజీ రావును కలిశారు. గ్రామ ముస్తాబు – విజన్ ఫర్ వేస్ట్ మేనేజ్మెంట్ అనే అంశంపై వారు తయారు చేసిన ప్రాజెక్టు ఉత్తమ ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా డిఇఒ వారిని అభినందించారు.

డీలర్లకు కమీషన్లు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి– సీతానగరం

మండలంలోని రేషన్ షాపుల డీలర్లకు కమీషను చెల్లించాలని డీలర్ల సంఘం అధ్యక్షులు జి.రామనాయుడు, ఎం.సుధాకర్ కోరారు. శుక్రవారం స్థానిక తాహశీల్దార్ కార్యాలయం ఎదుట వారు ప్రజాశక్తితో మాట్లాడారు. గత మూడు నెలలుగా రేషన్ డీలర్లకు కమీషన్ ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు. మక్కువ ఎం ఎల్ ఎస్ పాయింటర్ వద్ద సరుకులు తక్కువ వస్తున్నాయని పలుమార్లు అధికారులకు చెప్పినప్పటికీ ఫలితం లేదన్నారు.

28న కబడ్డీ జట్ల ఎంపిక

విజయనగరం టౌన్: జనవరి 2 నుండి 4 వరకు పశ్చిమగోదావరి జిల్లా వీరవాసంలో జరగబోయే 72వ రాష్ట్రస్థాయి మహిళల అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలలో పాల్గొనే విజయనగరం జిల్లా జట్టు ఎంపిక ఈనెల 28న కస్పా హైస్కూల్లో జరుగతుందని కబడ్డీ జిల్లా సంఘ అధ్యక్ష కార్యదర్శులు ఎ.రంగారావు దొర, కెవి ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిపేన లక్ష్మణరావు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు హాజరు కావాలని కోరారు.

గడ్డివాము దగ్ధం

శృంగవరపుకోట : మండలంలోని కొత్తకోట గ్రామానికి చెందిన కోరమాని కోటారావుకు చెందిన గడ్డిగాము శుక్రవారం దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.